# నియోజకవర్గ ప్రజల ముంగిటకే మెగా వైద్యం

**9న హుస్నాబాద్‌లో భారీ ఉచిత వైద్య శిబిరం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఏర్పాట్లు..**

**సురభి మెడికల్ కాలేజీ సహకారం**



హుస్నాబాద్, జనత న్యూస్:హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం ఈనెల 9వ తేదీన భారీ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు.సిద్దిపేటలోని సురభి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరం ద్వారా వేలాది మందికి ఉచితంగా వైద్య సేవలు అందనున్నాయి. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణతో పాటు అక్కన్నపేట, కోహెడ మండల కేంద్రాల్లో ఈ శిబిరాలు ఏకకాలంలో నిర్వహించబడతాయని మార్కెట్ కమీటీ చైర్మెన్ కంది తిరుపతి రెడ్డి, సింగిల్ విండో తాజా మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు వెల్లడించారు.

### అందుబాటులో నిపుణులైన వైద్యులు

ఈ మెగా వైద్య శిబిరంలో సురభి మెడికల్ కళాశాలకు చెందిన 14 రకాల విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలందించనున్నారు. సుమారు 50 మంది నిపుణులైన వైద్యులు, మరో 50 మంది పారామెడికల్ సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని రోగులకు క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహిస్తారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. సాధారణ రోగాలతో పాటు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి కూడా ఈ శిబిరం ఒక వరమని నిర్వాహకులు పేర్కొన్నారు.

### ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు

వైద్య పరీక్షల అనంతరం ఎవరికైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లయితే, వారికి మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అటువంటి బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో పూర్తి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు మిర్జాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఏర్పాట్ల పరిశీలన

శిబిరానికి సంబంధించి హుస్నాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరుగుతున్న ఏర్పాట్లను మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి ఏం సి వైస్ చైర్మన్ బంక చందు, సురభి మెడికల్ కాలేజీ వైద్య బృందం సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సురభి మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు, ప్రభుత్వ వైద్యాధికారులు వేణుగోపాల్ రెడ్డి, పరశురాం, మీర్జాపూర్ పీహెచ్సీ మైమునా, హెల్త్ సూపర్వైజర్ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

**అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలి : అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**




కరీంనగర్, జనతా న్యూస్: మున్సిపల్ ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధ్యక్షత వహించారు. నగరపాలిక కమిషనర్ ప్రపుల్ దేశాయ్, జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, మున్సిపల్ ముసాయిదా ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. వచ్చిన వినతులు, అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, మున్సిపాలిటీల పరిధిలో మరణించిన వ్యక్తుల పేర్లు ఉన్న ఓట్లను వెంటనే తొలగించాలని కోరారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు ప్రాంతాల్లో నమోదవకుండా, ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సక్రమంగా, పారదర్శకంగా రూపొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పోలింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలని పలువురు ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. ఇప్పటివరకు అందిన వినతులను స్వీకరించామని, మరణించిన వారి ఓట్లు లేదా రెండు చోట్ల నమోదైన ఓట్లపై స్పష్టమైన సమాచారం అందిస్తే వెంటనే తొలగింపు చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ పూర్తైన తరువాతే తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్లు నాగరాజు, అయాస్, సమ్మయ్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు వై. సునీల్ రావు, నాంపల్లి శ్రీనివాస్ (బీజేపీ), చల్లా హరిశంకర్, సత్తినేని శ్రీనివాస్ (బీఆర్ఎస్), మడుపు మోహన్ (కాంగ్రెస్), పైడిపల్లి రాజు (సీపీఐ), మిల్కూరి వాసుదేవ రెడ్డి (సీపీఐఎం), తేజ దీప్ రెడ్డి (ఏఐఎఫ్ ఎఫ్ బి) తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా మున్సిపల్ ఓటరు జాబితా పారదర్శకంగా, లోపాలు లేకుండా రూపొందించేందుకు రాజకీయ పార్టీలుఉ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉ ందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.

# ఏసంగి సాగునీటికి ఆటంకం కలగకూడదు

**ఇరిగేషన్ నాల్స్ వద్ద రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు సక్రమంగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ కే. హైమావతి**



సిద్దిపేట, జనతా న్యూస్: ఇరిగేషన్_నాల్స్ ద్వారా ఏసంగి పంటలకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఇరిగేషన్_నాల్స్ క్రాసింగ్ వద్ద రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలను జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఐఆర్ఎస్ అధికారి నవ్య శ్రీతో కలిసి రైల్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో జిల్లా పరిధిలోని ఇరిగేషన్_నాల్స్ వద్ద నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జిలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న రైల్వే లైన్ల పనులు, బ్రిడ్జి నిర్మాణాల వల్ల సాగునీటి సరఫరాపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఏసంగి సాగుకు అత్యంత కీలకమైన సమయం కొనసాగుతుందని, ఈ దశలో ఇరిగేషన్_నాల్స్ ద్వారా సాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకూడదని స్పష్టం చేశారు. రైల్వే శాఖ చేపడుతున్న బ్రిడ్జిల నిర్మాణాలు ఇరిగేషన్_నాల్స్ ప్రవాహానికి భంగం కలగకుండా, అవసరమైన సాంకేతిక ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని సూచించారు. సాగునీటి ప్రవాహం నిరంతరంగా కొనసాగేందుకు రైల్వేఉఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుధాకిరణ్, ఈఈ గోపాలకృష్ణ, వేణుబాబు, రైల్వే శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఏసంగి పంటల సాగుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని అధికారులు జిల్లా కలెక్టర్‌కు భరోసా ఇచ్చారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

**డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**

కరీంనగర్, జనతా న్యూస్: మౌలిక వసతుల అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరెంధర్ రెడ్డితో కలిసి 1వ, 20వ డివిజన్ల పరిధిలోని ఆరెపల్లిఉతీగలగుట్టపల్లి ప్రాంతాల మధ్య సుమారు రూ.45 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం తీగలగుట్టపల్లి ఆర్టీసీ కాలనీలో దాదాపు రూ.15 లక్షల సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు కూడా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చేపట్టే అన్ని అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు, పనుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను ఆలస్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులో వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనులు కొనసాగుతున్న సమయంలో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని, సరైన పద్ధతిలో క్యూరింగ్ నిర్వహించాలని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, పలువురు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొని అభివృద్ధి పనులు త్వరగా పూర్తవ్వాలని కోరారు. నగర అభివృద్ధిలో భాగంగా ఇలాంటి పనులు ప్రజలకు మౌలిక సౌకర్యాలు మెరుగుపరచడంలో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.



# మృతుల కుటుంబాలని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని కల్లేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన హర్షిత, చింతకింది ఐశ్వర్య, సావనపల్లి నారాయణ,మైల భూమయ్య ల కుటుంబాలను మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి లు మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పర్శ సంతోష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర రవి, రావుల నరసయ్య, బోనగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడిలో అన్న ప్రాసన కార్యక్రమం




జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని కల్లెపెల్లి గ్రామంలో గల అంగన్వాడి సెంటర్లో మంగళవారం నిర్వహించిన, అన్నప్రాసన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిగుళ్ల మోహన్ పాల్గొని పిల్లలకు పౌష్టికాహారాన్ని తినిపించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు కోడిగుడ్లు, బాలామృతం అందించి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీ స్త్రీలు, చంటి బిడ్డల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినీత్ గౌడ్, వార్డు మెంబర్ ఒగ్గు కనకయ్య, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో విషాదఛాయలు

**రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు అప్పల భీమశంకర్ శివైక్యం**



జనతా న్యూస్, వేములవాడ : వేములవాడ పట్టణాన్ని తీవ్ర విషాదంలో ముంచిన ఘటన చోటుచేసుకుంది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులుగా సేవలందించిన అప్పల భీమశంకర్ నిన్నటి రోజున అనారోగ్యంతో శివైక్యం చెందారు. వారి మృతి వార్తతో వేములవాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో శోకసంద్రం అలుముకుంది. దీర్ఘకాలంగా దేవస్థానంలో అర్చక సేవలు అందించిన భీమశంకర్ గారు భక్తుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. శాస్త్రోక్త పద్ధతుల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ ఆలయ సంప్రదాయాలను గౌరవంగా కొనసాగించారు. వారి మరణం పట్ల వేములవాడ పట్టణ ప్రజలు, పుర ప్రముఖులు, భక్తులు లోతైన సంతాపం తెలిపారు. ఈరోజు నిర్వహించిన అంతక్రియలకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై చివరి వీడ్కోలు పలికారు. అంతక్రియలు అశ్రు నయనాల మధ్య గంభీరంగా నిర్వహించబడ్డాయి. అప్పల భీమశంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని పలువురు ఆకాంక్షంచారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**విద్యార్థులు రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించాలి**




కరీంనగర్, జనతా న్యూస్: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు అధికారుల సమన్వయంతో పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, రోడ్డు నియమాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రోడ్డు నియమాలు పాటించని పక్షంలో చట్టపరంగా కఠిన శిక్షలు విధించబడతాయని, అలాగే మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలను విస్మరిస్తే రోడ్డు ప్రమాదాలకు గురై అంగవైకల్యం లేదా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని వివరించారు. యువత ముఖ్యంగా విద్యార్థులు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల తమ విలువైన ప్రాణాలతో పాటు భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తున్నారని, అందువల్ల రోడ్డు నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని వక్తలు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నపాటి జాగ్రత్తలు అనేక ప్రాణాలను కాపాడగలవని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలను పాటిస్తామని, ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ అవగాహన సదస్సులో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరీముల్లా ఖాన్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనకు మహేష్, ఎస్సై గణేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే కళాశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అధ్యాపక బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తంగా ఈ రోడ్డు భద్రత అవగాహన సదస్సు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన రవాణా సంస్కృతిని పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత లక్ష్యంగా కార్యాచరణ

### ప్రత్యేక స్టడీ అవర్స్ తప్పనిసరి : జిల్లా కలెక్టర్ కే. హైమావతి



సిద్దిపేట, జనతా న్యూస్: జిల్లాలో 2025, 26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ బద్ధంగా ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ప్రభుత్వ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట ఐడిఓసి సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, వివిధ గురుకుల విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత సంవత్సరం పదో తరగతి ఫలితాలు, ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చేపట్టిన చర్యలపై పాఠశాలల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానాల్లో నిలిచి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అదే స్థాయిలో ఈ సంవత్సరం కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో రేపటి నుంచే ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు వీక్‌గా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని తెలిపారు. కేవలం బట్టీపట్టించడమే కాకుండా, సబ్జెక్ట్ పూర్తిగా అర్థమయ్యేలా బోధన జరగాలని, తల్లిదండ్రులు, సంక్షమ హాస్టళ్లలోని సంక్షమ అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రతి విద్యార్థి రోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు టెన్షన్‌కు గురికాకుండా ముందుగానే స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించాలని, పిల్లలు ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచగలిగితేనే పరీక్షల్లోనూ, భవిష్యత్తులోనూ రాణిస్తారని తెలిపారు. ఇప్పటికీ కొందరు పదో తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం సరిగా రాకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించిన కలెక్టర్, ఇలాంటి పరిస్థితి రాకుండా ప్రాథమిక స్థాయి నుంచే పునాది బలంగా ఉండేలా త్వరలో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులతో కూడా ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. హైస్కూల్ స్థాయిలో అన్ని తరగతుల విద్యార్థులు చదవడం, రాయడంలో నైపుణ్యం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రతి విద్యార్థికి సమాన విద్యావకాశాలు కల్పించడమేనని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నైపుణ్యం గల ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయని, నాణ్యమైన విద్యాబోధన ద్వారా అడ్మిషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ మెనూ ప్రకారం పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో ఆహారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ప్రత్యేక అభ్యసన ప్రణాళిక బుక్లెట్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే రాష్ట్రస్థాయి చెకుమకీ సైన్స్ సంబరాలుఉ2025లో ప్రథమ బహుమతి సాధించిన సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంతకుముందు రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్, పాఠశాలలకు విద్యార్థులను తీసుకొచ్చే ఆటోలు, ప్రైవేటు వాహనాలు, బస్సుల డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల స్థితి, కాల పరిమితి తప్పనిసరిగా పరిశీలించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక లోడుతో ఆటోలలో విద్యార్థులను తరలించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఒక ఆటోలో ఆరుగురికి మించి విద్యార్థులను తీసుకురాకుండా కఠినంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షమ శాఖల అధికారులు, అన్ని మండలాల ఎంఈఓలు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ల డిసిఓలు, ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వందేళ్లుగా సమాజ, మాతృభూమి సేవలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర

### సంఘాన్ని అర్థం చేసుకోవాలంటే వచ్చి పనిచేయాలి : కాచం రమేష్ జీ




కరీంనగర్, జనతా న్యూస్: వందేళ్లుగా సమాజం, మాతృభూమి సేవ కోసం నిరంతరం స్వచ్ఛందంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అని, ఆర్ఎస్ఎస్‌ను నిజంగా అర్థం చేసుకోవాలంటే సంఘంలోకి వచ్చి పని చేయాలని తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్‌లో నిర్వహించిన విద్యావేత్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘ్ స్థాపన నాటి నుంచి హిందూ సమాజానికి అవసరమైన ప్రతి అంశంలో ఆర్ఎస్ఎస్ సేవలు అందిస్తూ వస్తోందన్నారు. సమాజ పరివర్తన ద్వారానే దేశ పరమవైభవం సాధ్యమన్న ఆలోచనతో శతాబ్ది సందర్భంగా ఆర్ఎస్ఎస్ 'పంచ పరివర్తన్'కు పిలుపునిచ్చిందని తెలిపారు. పంచ పరివర్తన్‌లో భాగంగా కుటుంబ ప్రబోధన్, స్వదేశీ భావన, సామాజిక పరివర్తన, పర్యావరణ పరిరక్షణ, పౌరబాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను స్వయంసేవకులు విస్తృతంగా చేపడుతున్నారని వివరించారు. ఒక గంట శాఖ కార్యక్రమాల ద్వారా వ్యక్తుల్లో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ గత వందేళ్లుగా నిరంతరాయంగా పనిచేస్తోందన్నారు. సంఘ్ స్థాపకులు డా. కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ 1925 విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను ఆత్మవిశ్వాసంతో, దూరదృష్టితో ప్రారంభించారని, భారతదేశ సమస్యలకు సమాజంలో ఉన్న అనైక్యతే ప్రధాన కారణమని ఆయన భావించారని గుర్తు చేశారు. జాతిని సంఘటితం చేయాలనే లక్ష్యంతోనే సంఘ్‌కు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సామాజిక స్పృహ, జాతీయ భావన, సంఘటిత దృష్టి, నిస్వార్థం, తోటి వారి పట్ల ప్రేమ, ఈర్ష్యాఉద్వేషం లేని వ్యక్తుల నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని కాచం రమేష్ జీ స్పష్టం చేశారు. హిందుత్వాన్ని కేవలం మతపరమైన లేదా రాజకీయ కోణంలో చూసినంతవరకు ఆర్ఎస్ఎస్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేమని అన్నారు. ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవాలంటే కనీసం ఆరు నెలలు సంఘంలోకి వచ్చి పనిచేయాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చిన మాటలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, కరీంనగర్ జిల్లా సంఘచాలక్ సీఏ. నిరంజనాచారి, జిల్లా సహ సంఘచాలక్ ఎలగందుల సత్యనారాయణతో పాటు పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు. సమావేశం ఆర్ఎస్ఎస్ శతజయంతి భావజాలాన్ని ప్రతిబింబించేలా స్ఫూర్తిదాయకంగా కొనసాగింది.

# ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి స్వగృహంలో ఘనంగా శ్రీ గోదా, రంగనాధుల కళ్యాణ మహోత్సవం



కరీంనగర్, జనతా న్యూస్: ధనుర్మాసం సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి స్వగృహంలో శ్రీ గోదాఉ రంగనాథుల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక క్రిస్టియన్ కాలనీలోని నివాసంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా సాగింది. ఈ సందర్భంగా డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ధనుర్మాసం అత్యంత విశిష్టమైనదని, ఈ మాసంలో శ్రీమహావిష్ణువును ఆరాధించడం ద్వారా శుభఫలితాలు, భోగభాగ్యాలు లభిస్తాయని అన్నారు. భగవంతుని పూజా కార్యక్రమాలు వ్యక్తి జీవనంలో శాంతి, సౌఖ్యాలను ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. ధర్మాన్ని అనుసరిస్తూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం వేదమంత్రోచ్ఛారణల మధ్య సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవంలో గృహాన్ని పుష్పాలతో, మాలలతో సుందరంగా అలంకరించారు. శ్రేయోభిలాషులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన కళ్యాణ ఘట్టం భక్తులకు అపార ఆనందాన్ని ఇచ్చింది. ధనుర్మాసంలో కరీంనగర్ సప్తగిరి కాలనీలోని శ్రీ కోదండ రామాలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది నుంచి ప్రారంభమైన 'ఇంటింటా శ్రీ గోదాఉరంగనాధుల కళ్యాణ మహోత్సవం'లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడడం పూర్వజన్మ సుకృతమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు కే. గౌతమ్ రావు, కోదండ రామాలయం గౌరవ అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, కార్యదర్శి గోనె రాజి రెడ్డి, ముస్కు రాజి రెడ్డి, ఉమారాణి, సిహెచ్ అరుణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిసింది.

# ఎస్సీ విభాగం చైర్‌పర్సన్‌గా డా. కవ్వంపల్లి సత్యనారాయణ నియామకం

### ఏఐసీసీకి కృతజ్ఞతలు తెలిపిన డా. సత్యనారాయణ

హైదరాబాద్ జనతా న్యూస్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగం చైర్‌పర్సన్‌గా మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణను నియమించేందుకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు ఆమోదం తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) వెల్లడించింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, ఎంపీ కే.సి. వేణుగోపాల్ అధికారిక ప్రెస్ రిలీజ్ జారీ చేశారు. టీపీసీసీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నియామకంపై డా. కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యత అప్పగించిన గౌరవ ఏఐసీసీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ పరిధిలో ఏఐసీసీ ప్రతినిధిగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే కాకుండా, ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజికఉఆర్థిక అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ డా. కవ్వంపల్లి సత్యనారాయణ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం మరింత బలపడుతుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# ఏబీవీపీ తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రటరీగా అలివేలి రాజు నియామకం



కరీంనగర్, జనతా న్యూస్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (అఖిల భారత విద్యార్థి పరిషత్ ఉ ఏబీవీపీ) 44వ రాష్ట్ర మహాసభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు రావుల కృష్ణ ఈ కార్యవర్గాన్ని ఎన్నుకోగా, కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు అలివేలి రాజును తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా అలివేలి రాజు మాట్లాడుతూ, రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై, విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టి విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ఏబీవీపీ నాయకత్వానికి అలివేలి రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంతో కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించిందని, విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తామని ఏబీవీపీ వర్గాలు పేర్కొన్నాయి.

# జిల్లా కాంగ్రెస్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీలకు నూతన నియామకాల కోసం దరఖాస్తుల స్వీకరణ




కరీంనగర్, జనతా న్యూస్: జిల్లా కాంగ్రెస్ కమిటీతో పాటు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీల్లో నూతన నియామకాల కోసం ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరణను బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రతినిధులు నమిండ్ల శ్రీనివాస్, గౌస్ పాషా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్లు ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలు జిల్లా కాంగ్రెస్ కమిటీ, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీల్లో వివిధ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన వారికి సముచిత ప్రాధాన్యం కల్పించడమే లక్ష్యంగా అధిష్టానం నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పార్టీ కమిటీల్లో పదవులతో పాటు దేవస్థానాలు, వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను కూడా నామినేషన్ ద్వారా భర్తీ చేసి అందరికీ న్యాయం చేకూరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజ్, శ్రావణ్ నాయక్, సిరాజుద్దీన్, ఎస్.ఏ. మోసిన్, అహమ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్, సిరిపురం నాగప్రసాద్‌తో పాటు భారీ సంఖ్యలో ఆశావాహులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ, కార్పొరేషన్ కమిటీల పునర్వ్యవస్థీకరణతో పార్టీ బలోపేతం మరింత వేగవంతమవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# రోడ్ సురక్ష అభియాన్‌లో భాగంగా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

### విక్టరీ చౌరస్తాలో వాహనదారులకు సూచనలు



సిద్దిపేట, జనతా న్యూస్ : కమిషనర్ ఆఫ్ పోలీస్, సిద్దిపేట గారి ఆదేశాల మేరకు రోడ్ సురక్ష అభియాన్ / రహదారి భద్రత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ప్రధాన కూడలి అయిన విక్టరీ చౌరస్తా ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ సిఐ. ప్రవీణ్ కుమార్ తన సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగిన వాహనదారులకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. వాహనాలు నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ చేయాలంటే చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. అలాగే అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని, వేగ నియంత్రణ పాటించాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సైలు విజయ భాస్కర్, గోపాల్ రెడ్డి, ఉమేష్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి, కానిస్టేబుల్స్ అఖిల్, ప్రవీణ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి



సిద్దిపేట, జనతా న్యూస్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సిటీ పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్ తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 7(1)ఉ2016 యాక్ట్, సెక్షన్ 22(1)(ఝ) నుంచి (ట), 22(2)(ఝ)(ఎ), 22(3), సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫాస్లి సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం తేదీ 08-01-2026 ఉదయం 6:00 గంటల నుంచి 23-01-2026 ఉదయం 6:00 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ కాలవ్యవధిలో కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. పై కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. బంద్‌ల పేరిట బలవంతంగా సంస్థలు, కార్యాలయాలు మూసివేయాలని ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సూచించారు.

### డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు

అదేవిధంగా, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో తేదీ 08-01-2026 ఉదయం 6:00 గంటల నుంచి 23-01-2026 ఉదయం 6:00 గంటల వరకు డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. సిటీ పోలీస్ యాక్ట్ 7(1)ఉ 2016, సెక్షన్ 55 డిబి(గూ), 45 డిబి(గూ), 65 డిబి(గూ), పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 30, నాయిస్ పొల్యూషన్ (రెగ్యులేషన్ ఉ కంట్రోల్) రూల్స్‌ఉ2000 రూల్ నెంబర్ 8 ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు భారీ సౌండ్లతో కూడిన డీజే వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మైక్ సెట్ వినియోగం అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి పొందాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజే వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### చట్టపరమైన చర్యలు

పై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 223 దీఛీూ, సెక్షన్ 70(గూ), 70(దీ), 70(జ), 76, సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫాస్లి సెక్షన్ 76, పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 30 ప్రకారం కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ప్రజా బాట కార్యక్రమంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం

## ఎలగందల్, బొమ్మకల్ గ్రామాల్లో మరమ్మతులు




కరీంనగర్, జనతా న్యూస్: ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా పరిధిలోని ఎలగందల్ మరియు బొమ్మకల్ గ్రామాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, స్థానికంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యుత్ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలగందల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిమ్మల అంజయ్య, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ వినియోగదారులు, ఏఈ చంద్రశేఖర్, విద్యుత్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమాదకరంగా ఉన్న ఆరు డామేజీ/మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయగా, కొన్ని చోట్ల లూజు వైర్లు సరిచేశారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇనుప స్తంభాలు మార్పు అవసరమని గ్రామస్తులు కోరగా, వాటిని దశలవారీగా చేపడతామని అధికారులు తెలిపారు. బొమ్మకల్ గ్రామంలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ జంపాల రాజం, ఏడీఈ గడం రఘు, ఏఈ ప్రదీప్ రెడ్డితో పాటు సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు. ఇక్కడ లూజు వైర్లు, వంగిన పోల్స్ సరిచేయడంతో పాటు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ హెచ్ జి ఫ్యూజ్ సెట్ను రిపేర్ చేశారు. విద్యుత్ భద్రతపై అవసరమైన సూచనలు ఇచ్చారు. రెండు గ్రామాల్లోనూ చేపట్టిన పనులతో విద్యుత్ సరఫరా భద్రత మెరుగుపడిందని, సమస్యలు వెంటనే పరిష్కరించడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా బాట కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించడం కొనసాగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

# సరస్వతి శిశు మందిర్ దేశ భవిష్యత్తుకు పునాది

## 'ఖేల్ ఖుద్ క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, జనతా న్యూస్: దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన రెండు రోజుల 'ఖేల్ ఖుద్ణ క్రీడా కార్యక్రమాన్ని ఆయన క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన బండి సంజయ్, శిశు మందిర్ విద్య అనేది కేవలం మార్కులు, ర్యాంకులు, ప్యాకేజీలకే పరిమితం కాదని, సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, మానవీయ విలువలను పెంపొందించే సమగ్ర విద్య అని పేర్కొన్నారు. "సంస్కారం ం సైన్స్ ం స్పోర్ట్స్ా శిశు మందిర్ విద్య" అని వివరించారు. తాను ఇదే పాఠశాలలో రేకుల షెడ్డు కింద చదువుకున్నానని గుర్తుచేసుకుంటూ, శిశు మందిర్‌లో చదవడం తన అదృష్టమని అన్నారు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని శిశు మందిర్ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడంతో పాటు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందిస్తానని, భవిష్యత్తులో ల్యాప్‌టాప్‌లు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ హామీలు, నిధులపై ఆధారపడకుండా పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం పనిచేస్తున్న సంస్థ శిశు మందిర్ అని ఆయన ప్రశంసించారు. క్రీడా కార్యక్రమాల్లో భాగంగా బండి సంజయ్ విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. శిశు మందిర్ గురువులు నవ భారతాన్ని నిర్మించే నిజమైన శిల్పులని కొనియాడుతూ, విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి దేశ సేవకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన తిమ్మాపూర్ మండలం బీజేపీ శ్రేణులు



కరీంనగర్, జనతా న్యూస్: తిమ్మాపూర్ మండలానికి చెందిన బీజేపీ శ్రేణులు మంగళవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ను కలిసినట్లు మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ రాంహన్మాన్ నగర్ ఉప సర్పంచ్ అందె శేఖర్, వార్డు సభ్యులు ప్రవీణ్, కొమ్ము శేఖర్, బీజేపీ నాయకులు పిస్క కృష్ణకిశోర్‌లు, కరీంనగర్ మాజీ మేయర్ వై. సునీల్ రావుతో కలిసి కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. అలాగే శ్రీరామచంద్ర ఆశ్రమం కాలనీలోని ఆశ్రమ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఆశ్రమం అధ్యక్షులు రామరాజు, కార్యదర్శి అశోక్, సభ్యులు శ్రీరాములు, ఆశ్రమం మేనేజర్ మాచర్ల అంజయ్యలు కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) అధ్యక్షులు గడ్డం అరుణ్‌తో పాటు ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని బీజేపీ శ్రేణులు తెలిపారు.

# ఉల్లాస్‌లో భాగంగా 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం

## కళాభారతిలో అక్షరాస్యతపై శిక్షణ సదస్సు



కరీంనగర్, జనతా న్యూస్: నగరపాలక సంస్థ కరీంనగర్ పరిధిలోని కళాభారతిలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 'అమ్మకు అక్షరమాల' అక్షరాస్యత కార్యక్రమాన్ని సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఒకరోజు ప్రత్యేక శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉల్లాస్‌కు సంబంధించిన లైసెన్ ఆఫీసర్ ఆంజనేయులు, సీఆర్‌పీలు అరుణ, శోభ పాల్గొని అక్షరాస్యత కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించారు. సిరి, మల్లికార్జున, శ్రీశైల, శ్రీ మహాలక్ష్మి పట్టణ సమైక్యల అధ్యక్షులు, ఆర్పీలు, యాక్టివ్ పర్సన్‌లకు శిక్షణ అందించారు. సదస్సులో మహిళలు అక్షరాస్యులుగా మారితే సాధించగల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య వల్ల కలిగే వివిధ ప్రయోజనాలు, కుటుంబంఉసమాజంలో మహిళ పాత్ర బలోపేతం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అక్షరాస్యత మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వరూప రాణి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, డీఎంసీ శ్రీవాణి హాజరయ్యారు. వీరితో పాటు టీఎంసీలు, సీఈవోలు, ఏఎల్ఎఫ్ ఓబీలు, ఆర్పీలు, యాక్టివ్ మెంబర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తంగా 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం మహిళల్లో అక్షరాస్యతపై అవగాహన పెంచి, వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా విజయవంతంగా నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

# మంచినీటి సమస్యకు పరిష్కారం

## ఎలగందల్‌లో బోర్ ప్రారంభించిన బీజేపీ నాయకులు



కరీంనగర్, జనతా న్యూస్: కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామం బస్టాండ్ కమాన్ యాదవ వాడలో నెలకొన్న మంచినీటి సమస్యకు పరిష్కారం లభించింది. స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి బోర్ మంజూరు చేయించారు. మంజూరైన బోర్‌కు మంగళవారం మోటార్ బిగించి నీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో యాదవ వాడ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, తక్షణ స్పందన చూపిన కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నాళ్లుగానో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్, ఎలగందల్ మాజీ ఉపసర్పంచ్ బోనాల నరేష్, బోనాల అంజయ్య, జంగిలి రాజు, గడ్డి శేఖర్, జంగిలి రవి, గుండా సిద్దు, మిట్ట వంశి, రమేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమవంతు కృషి కొనసాగిస్తామని బీజేపీ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com